

## తనిష్కకు రజతం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: కటక్(ఒడిశా) వేదికగా జరిగిన జాతీయ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన తనిష్క రజత పతకంతో మెరిసింది. మంగళవారం జరిగిన బాలికల అండర్-10 విభాగంలో బరిలోకి దిగిన తనిష్క అద్భుత ప్రతిభ కనబర్చింది.

## స్నేహిత్‌కు కాంస్యం



హైదరాబాద్, ఆట ప్రతినిధి: రష్యా వేదికగా జరుగుతున్న బ్రిక్స్ గేమ్స్‌లో భారత యువ టేబుల్ టెన్నిస్ ప్లేయర్ ఎస్ఎఫ్ ఆర్ స్నేహిత్ కాంస్య పతకంతో మెరిశాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో స్నేహిత్ 0-3(9-11, 8-11, 6-11)తో కిరిల్ షచ్కోవ్(రష్యా) చేతిలో ఓడి కాంస్యం ఖాతాలో వేసుకున్నాడు. అంతకుముందు జరిగిన క్వార్టర్స్‌లో స్నేహిత్ 3-2(11-2, 11-8, 6-11, 10-12, 11-8)తో భారత్‌కే చెందిన జీత్‌చంద్రను ఓడించాడు.

# పూరన్ వీరవిహారం

**విజయంతో ముగించిన విండీస్**

**అఫ్గాన్‌కు తొలి ఓటమి**

సెయింట్ లూసియా: టీ20 ప్రపంచకప్ ఆతిథ్య దేశం వెస్టిండీస్.. ఈ టోర్నీలో ఆఖరి గ్రూప్ దశ మ్యాచ్‌ను ఘనవిజయంతో ముగించింది. ఆడిన మూడు మ్యాచ్‌లలోనూ ఓటమన్నదే లేకుండా తమ బౌలింగ్‌తో ప్రత్యర్థులను వణికించిన అఫ్గానిస్థాన్‌కు ఓటమి రుచి చూపించింది. సెయింట్ లూసియా వేదికగా మంగళవారం జరిగిన ఆఖరి గ్రూప్ మ్యాచ్‌లో అఫ్గాన్‌పై 104 పరుగుల తేడాతో గెలిచింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' నికోలస్ పూరన్ (53 బంతుల్లో 98, 6 ఫోర్లు, 8 సిక్సర్లు) మరోసారి పూనకమొచ్చినట్టు ఊగిపోయి తృటిలో శతకాన్ని చేజార్చుకోగా జాన్సన్ చార్లెస్ (27 బంతుల్లో 43, 8 ఫోర్లు) రాణించడంతో మొదట బ్యాటింగ్ చేసిన విండీస్.. 20 ఓవర్లలో 218 పరుగుల భారీ స్కోరు చేసింది. ఛేదనలో అఫ్గానిస్థాన్.. 16.2 ఓవర్లలో 114 పరుగులకే ఆలౌటైంది. ఇబ్రహీం జద్రాన్ (38) టాప్ స్కోరర్.

**ఒకే ఓవర్లో 36 పరుగులు..**

మ్యాచ్‌లో పూరన్ ఆటే హైలైట్. రెండో ఓవర్లోనే అజ్మతుల్లా.. బ్రాండన్ కింగ్ (7)ను బౌల్డ్ చేయడంతో క్రీజులోకి వచ్చిన పూరన్.. చార్లెస్‌తో కలిసి వీరవిహారం చేశాడు. అజ్మతుల్లానే వేసిన 4వ ఓవర్లో ఈ జోడీ 36 పరుగులు పిండుకుని 2007 టీ20 ప్రపంచకప్‌లో యువరాజ్ రికార్డును సమం చేసింది. ఇందులో 26 పరుగులు పూరన్ చేసినవి కాగా మిగితావి వైడ్స్, నోబాల్, లెగ్ బైస్ ద్వారా వచ్చినవి. ఇదే జోరు కొనసాగించిన పూరన్.. 32 బంతుల్లో అర్ధ సెంచరీ తర్వాత మరింత రెచ్చిపోయాడు. రషీద్ 18వ ఓవర్లో 6, 4, 6, 6 బాదిన అతడు.. నవీనుల్ 20వ ఓవర్‌లో రెండు సిక్సర్లతో 98కి చేరాడు. కానీ నాలుగో బంతికి రనౌట్ అవడంతో నిరాశగా వెనుదిరిగాడు. ఛేదనలో అఫ్గాన్ బ్యాటర్లు తేలిపోయారు. ఒబెడ్ మెక్‌కాయ్ (3/14), అకీల్ హోసెన్ (2/21), గుడకేశ్ మోటీ (2/28) విజృంభించడంతో ప్రత్యర్థి బ్యాటర్లు విలవిల్లాడారు.

**సంక్షిప్త స్కోర్లు**

**వెస్టిండీస్:** 20 ఓవర్లలో 218/5 (పూరన్ 98, చార్లెస్ 43, గుల్బాదిన్ 2/14, నవీనుల్ 1/41). **అఫ్గానిస్థాన్:** 16.2 ఓవర్లలో 114 ఆలౌట్ (జద్రాన్ 38, అజ్మతుల్లా 23, మెక్‌కాయ్ 3/14, అకీల్ 2/21)



పూరన్ (98)

# నీరజ్‌కు పసిడి పతకం

- **పావో నుర్మి గేమ్స్**



టుర్కు(ఫిన్‌లాండ్): భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా..అద్భుత ప్రదర్శన దిగ్విజయంగా కొనసాగుతున్నది. ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌కు ముందు నీరజ్ మరో మారు సత్తాచాటాడు. పావో నుర్మి గేమ్స్‌లో నీరజ్ పసిడి పతకంతో మెరిశాడు. మంగళవారం జరిగిన జావెలిన్‌త్రో ఫైనల్లో చోప్రా..బరిసెను 85.97మీటర్ల దూరం విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. రెండేండ్ల క్రితం ఇదే టోర్నీలో రజత పతకం దక్కించుకున్న ఈ స్టార్ అథ్లెట్ ఈసారి అదరగొట్టాడు. ఇదే విభాగంలో పోటీపడ్డ ఫిన్‌లాండ్‌కు చెందిన టోనీ కెరానెన్(84.19మీ), ఒలివర్ హేలాండర్(83.96మీ) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. ఇటీవలే దోహ డైమండ్ లీగ్‌లో రెండో స్థానంలో నిలిచిన నీరజ్..ఫెడరేషన్‌కప్(భువనేశ్వర్)లో స్వర్ణం సాధించాడు. అయితే తొడకండరాల గాయంతో దాదాపు నెల రోజుల పాటు పోటీలకు దూరంగా ఉన్నాడు.

# అర్జున్ ఖాతాలో మరో టైటిల్

- **స్టెపన్ అవగ్యన్ మెమోరియల్ విజేత**



జెర్ముక్: తెలంగాణ యువ చెస్ ఆటగాడు అర్జున్ ఇరిగేసి ఖాతాలో మరో ప్రతిష్ఠాత్మక టైటిల్ చేరింది. అర్మేనియాలోని జెర్ముక్ వేదికగా జరిగిన స్టెపన్ అవగ్యన్ మెమోరియల్ చెస్ టోర్నమెంట్‌లో అర్జున్ విజేతగా నిలిచాడు. మంగళవారం ముగిసిన 9వ రౌండ్‌లో నల్లపావులతో బరిలోకి దిగిన అర్జున్.. అర్మేనియాకే చెందిన పెట్రోస్యన్‌తో గేమ్‌ను 43 ఎత్తుల్లో డ్రా చేసుకుని 6.5 పాయింట్లతో టైటిల్ నెగ్గాడు. ఈ టోర్నీలో 9 గేమ్స్ ఆడిన అర్జున్.. నాలుగింటిలో గెలిచి ఐదు గేమ్‌లను డ్రా చేసుకున్నాడు. పెట్రోస్యన్‌తో మ్యాచ్ కంటే ముందే రష్యా ఆటగాడు వోలోడర్ ముర్జిన్‌ను ఓడించి మరో రెండు రౌండ్లు ఉండగానే టైటిల్ ఖాయం చేసుకున్నాడు. తాజా విజయంతో ప్రపంచ చెస్ లైవ్ ర్యాంకింగ్స్‌లో 2,778 పాయింట్లతో నాలుగో స్థానానికి దూసుకెళ్లాడు. కార్ల్‌సన్, నకముర, ఫాబియానో తొలి మూడు స్థానాల్లో ఉన్నారు.

# శుభాంకర్, గగన్‌జీత్‌కు పారిస్ బెర్తు



శుభాంకర్

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌కు భారత యువ గోల్ఫర్లు శుభాంకర్‌శర్మ, గగన్‌జీత్ భుల్లార్ బెర్తు దక్కించుకున్నారు. ఆగస్టు 1 నుంచి 4వ తేదీ వరకు జరిగే విశ్వక్రీడల గోల్ఫ్ కోసం అంతర్జాతీయ గోల్ఫ్ ఫెడరేషన్ మంగళవారం పురుషుల, మహిళా గోల్ఫర్లతో కూడిన జాబితాను ప్రకటించింది. ప్రస్తుతం ఒలింపిక్ ర్యాంకింగ్స్‌లో 48వ స్థానంలో ఉన్న భారత నంబర్‌వన్ గోల్ఫర్ శుభాంకర్ పారిస్ విశ్వక్రీడల్లో అరంగేట్రం చేయబోతున్నాడు. గగన్‌జీత్ 54వ ర్యాంక్‌తో పారిస్ టికెట్ దక్కించుకున్నాడు. మరోవైపు అదితి అశోక్(24), దీక్షా దాగర్(40) కూడా ఒలింపిక్స్‌కు అర్హత సాధించే అవకాశముంది. ఈ నెల 24న తుది జాబితా విడుదల కానుంది.

# అభిమానులతో పాక్ పేసర్ రవూఫ్ గొడవ

ఫ్లోరిడా: పాకిస్థాన్ పేసర్ హరీస్ రవూఫ్ మరోసారి తన దురుసు ప్రవర్తనతో వార్తల్లో నిలిచాడు. టీ20 ప్రపంచకప్‌లో నిరాశజనక ప్రదర్శనతో గ్రూప్ దశలోనే నిష్క్రమించినా ఇంకా అమెరికాలోనే ఉన్న పాక్ క్రికెటర్లలో రవూఫ్ ఒకడు కాగా.. మంగళవారం అతడు తన భార్యతో కలిసి ఫ్లోరిడా వీధుల్లో చక్కర్లు కొడుతుండగా అటుగా వచ్చిన కొంతమంది అభిమానులతో గొడవపడ్డాడు. గొడవ వద్దని భార్య వారిస్తున్నా వినకుండా వారిపై చిందులు తొక్కిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రపంచకప్ ఓటమితో పాక్ క్రికెటర్లపై అభిమానులు ఆగ్రహంగా ఉన్న విషయం తెలిసిందే.

# ఫ్రాన్స్ బోణీ

**యూరో కప్**



డస్సెల్‌డార్ఫ్: ప్రతిష్ఠాత్మక యూరో కప్‌లో టైటిల్ ఫేవరేట్‌గా బరిలోకి దిగిన ఫ్రాన్స్ బోణీ కొట్టింది. డస్సెల్‌డార్ఫ్ (జర్మనీ) వేదికగా జరిగిన మ్యాచ్‌లో 1-0తో ఆస్ట్రియాను ఓడించింది. ఫ్రాన్స్ తరఫున 38వ నిమిషంలో మ్యాక్సిమిలిన్ ఓబర్ ఏకైక గోల్ చేశాడు. ఆస్ట్రియా పలుమార్లు గోల్‌పోస్ట్‌కు దగ్గరగా వచ్చినా ఫ్రాన్స్ దానిని సమర్థవంతంగా తిప్పికొట్టింది. ఈ మ్యాచ్‌లో ఫ్రాన్స్ సూపర్ స్టార్ కిలియన్ ఎంబాపె ముక్కుకు గాయమవడంతో అతడు పలు మ్యాచ్‌ల దూరమయ్యే అవకాశమున్నట్టు సమాచారం.

## టీ20 వరల్డ్‌కప్ సూపర్-8 షెడ్యూల్

| | | | |
|---|---|---|---|
| జూన్ 19 | యూఎస్ఏX దక్షిణాఫ్రికా | అంటిగ్వా | రా: 8.00 |
| జూన్ 20 | ఇంగ్లండ్Xవెస్టిండీస్ | సెయింట్ లుసియా | ఉ: 6.00 |
| | భారత్ X అఫ్గానిస్థాన్ | బార్బడోస్ | రా: 8.00 |
| జూన్ 21 | ఆస్ట్రేలియాXబంగ్లాదేశ్ | అంటిగ్వా | ఉ: 6.00 |
| | ఇంగ్లండ్Xదక్షిణాఫ్రికా | సెయింట్ లుసియా | రా: 8.00 |
| జూన్ 22 | యూఎస్ఏXవెస్టిండీస్ | బార్బడోస్ | ఉ: 6.00 |
| | భారత్Xబంగ్లాదేశ్ | అంటిగ్వా | రా: 8.00 |
| జూన్ 23 | అఫ్గానిస్థాన్Xఆస్ట్రేలియా | సెయింట్ విన్సెంట్ | ఉ: 6.00 |
| | యూఎస్ఏXఇంగ్లండ్ | బార్బడోస్ | రా: 8.00 |
| జూన్ 24 | వెస్టిండీస్Xదక్షిణాఫ్రికా | అంటిగ్వా | ఉ: 6.00 |
| | భారత్ X ఆస్ట్రేలియా | సెయింట్ లుసియా | రా: 8.00 |
| జూన్ 25 | అఫ్గానిస్థాన్Xబంగ్లాదేశ్ | సెయింట్ విన్సెంట్ | ఉ: 6.00 |

స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

# గంభీర్ నియామక ప్రక్రియ షురూ!

- **సీఏసీతో తొలి రౌండ్ ఇంటర్వ్యూ పూర్తి**



ముంబై: భారత క్రికెట్ జట్టుకు హెడ్‌కోచ్ రేసులో ఉన్న గౌతం గంభీర్ ఆ దిశగా మరో అడుగు ముందుకేశాడు. మంగళవారం బీసీసీఐ ఆధ్వర్యంలోని క్రికెట్ అడ్వైజరీ కమిటీ (సీఏసీ).. గంభీర్‌ను వీడియో కాల్ ద్వారా ఇంటర్వ్యూ చేసింది. దీనిపై బీసీసీఐ ప్రతినిధి ఒకరు స్పందిస్తూ.. 'అవును. ఈరోజు సీఏసీతో గంభీర్ వీడియో కాల్‌లో తొలి రౌండ్ ఇంటర్వ్యూను పూర్తిచేశాడు. బుధవారం మరో రౌండ్ ఉంటుంది' అని వెల్లడించాడు. సీఏసీ చైర్మన్ అశోక్ మల్హోత్రా, సభ్యులు జతిన్ పరంజపె, సులక్షణ నాయక్ ఈ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఐసీసీ టోర్నీలు ముందున్న నేపథ్యంలో రాబోయే మూడేండ్లలో తన ప్రణాళికలను గంభీర్.. సీఏసీకి వివరించినట్టు బీసీసీఐ వర్గాల సమాచారం. బుధవారం నాటి ఇంటర్వ్యూ ప్రక్రియ కూడా పూర్తయితే రాబోయే రెండు, మూడు రోజుల్లో గంభీర్‌ను హెడ్‌కోచ్‌గా నియమిస్తూ అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది.

# ఇంతకీ పవన్ మనసులో ఏముంది?



తెలుగురాష్ర్టాల్లో విశేషమైన అభిమానగణం ఉన్న కథానాయకుడు పవన్‌కల్యాణ్. ప్రస్తుతం ఆయన ఏపీ ఎన్నికల్లో అఖండ విజయాన్ని సాధించి, పొత్తులో భాగంగా ఆ రాష్ట్రానికి డిప్యూటీ సీఎంగా ఎంపికయ్యారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి అనుక్షణం కృషిచేయాల్సిన బాధ్యత ప్రస్తుతం ఆయనపై ఉంది. మరోవైపు పవన్‌కల్యాణ్ సినిమాలకు గుడ్‌బై చెప్పనున్నారన్న వార్త కూడా సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తున్నది. అయితే.. ఆయన హీరోగా మూడు సినిమాలు ప్రస్తుతం నిర్మాణదశలో ఉన్నాయి. అందులో ఒకటి 'హరిహరవీరమల్లు'. ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే 75శాతం పూర్తయింది. ఇక రెండో సినిమా 'ఓజీ'. సుజీత్ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రం షూటింగ్ దాదాపు 60శాతం కంప్లీట్ అయ్యింది. మూడో సినిమా 'ఉస్తాద్ భగత్‌సింగ్'. హరీశ్‌శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం షూటింగ్ 30శాతం పూర్తయింది. ఈ సినిమాలకు సంబంధించిన పవన్‌కల్యాణ్ వెర్షన్స్ వరకూ యుద్ధప్రాతిపదికన తీసినా కనీసం ఏడెనిమిది నెలలైన పడుతుంది. ప్రస్తుతం డిప్యూటీ సీఎంగా ఉన్న పవన్‌కల్యాణ్ ఏకబిగిన ఏడెనిమిది నెలలు డేట్స్ ఇవ్వడం కుదిరేపనికాదు. కాబట్టి, ప్రస్తుతానికి రెండుపడవలపై కాళ్లు వేయాల్సిందేనని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సినిమాకు వందకోట్ల వరకూ పారితోషికం తీసుకునే స్టార్‌డమ్ పవన్ సొంతం. అలాంటి స్టార్‌డమ్‌నీ, ఆదాయాన్ని వదులుకొని రాజకీయాలకే పరిమితమవుతారా? లేక తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుడు ఉదయనిధిలా ఓ వైపు రాష్ట్రమంత్రిగా బాధ్యతల్ని నిర్వర్తిస్తూ, మరోవైపు సినిమాలు చేసుకుంటూ ముందుకెళ్తారా? ఇంతకీ అసలు పవన్ మనసులో ఏముంది? ఈ ప్రశ్నలకు సమాధానం తెలియాలంటే.. ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

# అదీ అసలు కారణం!

తెలుగులో అరంగేట్రం చేసిన తొలినాళ్లలో యువతరంలో మంచి క్రేజ్‌ను సంపాదించుకుంది పంజాబీ భామ తాప్సీ. అగ్ర కథానాయికల్లో ఒకరిగా ఓ వెలుగువెలిగిన ఆమె.. ఆ తర్వాత బాలీవుడ్‌కు మకాంను మార్చింది. దక్షిణాది చిత్రాలకు భిన్నంగా హిందీలో ప్రయోగాత్మక, సామాజిక సందేశాత్మక కథాంశాలకు పెద్దపీట వేస్తూ అనతికాలంలోనే తన ప్రతిభను చాటుకుంది. హిందీ చిత్రసీమలో తనకు వరుసగా అవకాశాలు రావడానికి కారణాలేమిటో ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో చెప్పింది తాప్సీ. 'ప్రీతీ జింటాతో నాకు చాలా దగ్గరి పోలికలు కనిపిస్తాయి. ముఖకవళికలు కూడా అలాగే ఉంటాయి. ఆమెకు నేను న్యూ వెర్షన్ అని చెప్పొచ్చు. అందుకే నాకు బాలీవుడ్‌లో మంచి అవకాశాలు దక్కాయి. ప్రీతీ జింటా ఎప్పుడూ పాజిటివ్ దృక్పథంతో కనిపిస్తారు. స్క్రీన్‌మీద ఆమె చాలా ఎనర్జిటిక్‌గా ఉంటారు. వ్యక్తిగతంగా కూడా నేను ఆమెను స్ఫూర్తిగా తీసుకుంటాను. ప్రీతి జింటా మాదిరిగానే మంచి సినిమాలతో ప్రేక్షకులను మెప్పిస్తాను' అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ భామ హిందీలో మూడు చిత్రాలతో బిజీగా ఉంది.



చిత్రం

# వింటేజ్ ప్రేమకథ?



చిన్న సినిమా చేయడమే కష్టంగా ఉన్న ఈ రోజుల్లో వరుసపెట్టి పాన్ ఇండియా ప్రాజెక్టులు చేస్తూ పరిశ్రమ మొత్తాన్ని ఆశ్చర్యానికి లోనుచేస్తున్నారు ప్రభాస్. ఆయన 'కల్కి 2898' ఈ నెల 27న విడుదల కానుంది. ఇప్పటికే మారుతి 'రాజా సాబ్' సినిమాను కూడా మధ్యమధ్యలో కానిచ్చేస్తున్నారు ప్రభాస్. ఈ సినిమా షూటింగ్ కూడా సగంపైన పూర్తయింది. 'కల్కి 2898' తర్వాత పూర్తిగా 'రాజా సాబ్'వైపే దృష్టిపెడతారట. ఇంకోవైపు ప్రశాంత్‌నీల్ 'సలార్ సౌర్యాంగపర్వం' ఎలాగూవుంది. ఈ సినిమా షూటింగ్‌ను ప్రశాంత్‌నీల్ ఎప్పుడు షురూ చేస్తారు? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఇదిలావుంటే ప్రభాస్ కొత్త సినిమాకు సంబంధించిన అప్‌డేట్ ఒకటి ఇప్పుడు వినిపిస్తున్నది. దర్శకుడు హను రాఘవపూడి కథకి ప్రభాస్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. వింటేజ్ ప్రేమకథగా రూపొందనున్న ఈ సినిమాలో ప్రభాస్ కొంత భాగం సైనికుడిగా కనిపిస్తారట. ఈ సినిమాకు సంబంధించిన ఫొటో షూట్‌ని కూడా త్వరలోనే నిర్వహించనున్నారు హను రాఘవపూడి. విశాల్ చంద్రశేఖర్ ప్రస్తుతం బాణీలు కట్టే పనిలో ఉన్నారు. మొత్తంగా చూసుకుంటే సినిమా మీద సినిమా చేస్తూ తోటి హీరోలకు కూడా ఆదర్శంగా నిలుస్తున్నారు ప్రభాస్.

# 'కల్కి' అన్ని కథలకు క్లైమాక్స్!



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన సైన్స్ ఫిక్షన్ మైథాలజీ చిత్రం 'కల్కి' ఈ నెల 27న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. దీంతో చిత్ర బృందం ప్రచార పర్వంలో వేగాన్ని పెంచింది. ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన రావడంతో ప్రేక్షకులు ఈ సినిమా కోసం ఉత్సుకతతో ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో 'కల్కి' కథ తాలూకు ఆసక్తికరమైన విషయాలను ఓ వీడియో ద్వారా పంచుకున్నారు దర్శకుడు నాగ్‌అశ్విన్. ఆయన మాట్లాడుతూ 'ఇండియాలో మాత్రమే కాదు ప్రపంచం మొత్తం 'కల్కి' కథతో కనెక్ట్ అవుతుంది. మన జానపద చిత్రాల్లో పాతాళ భైరవి, భైరవ ద్వీపం, ఆదిత్య 369 నాకు ఇష్టమైన సినిమాలు. 'స్టార్‌వార్స్' లాంటి సినిమాలు చూసినప్పుడు ఇలాంటి సినిమాలు హాలీవుడ్‌లోనే రావాలా? మన కథలతో అలాంటి సినిమాలు తీయలేమా? అనిపించేది. దశావతారాల్లో ఒకటైన కృష్ణావతారం ద్వాపరయుగంలో వస్తే.. కలియుగం ఆఖరులో పదవ అవతారమైన కల్కి ఆగమనం జరుగుతుంది. అప్పుడు ఎలాంటి సంఘటనలు చోటు చేసుకుంటాయనే ఊహ నుంచి ఈ కథ రాసుకున్నా. మనం చదివిన పురాణాలన్నింటికి ఈ కథ క్లైమాక్స్‌లా ఉంటుంది. వెలుగు చీకటి నడుమ సంగ్రామంలో చివరికి ఏం జరుగుతుందనే ఆలోచన నుంచే ఈ కథ రాసుకున్నా. కథ రాసుకోవడానికి ఐదేళ్లు పట్టింది. సైన్స్ ఫిక్షన్‌కు మైథాలజీని జోడించి చేసిన ఈ ప్రయత్నం తప్పకుండా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది' అన్నారు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి.అశ్వనీదత్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అమితాబ్, కమల్‌హాసన్, దీపిక పదుకొనే, దిషాపటానీ, రాజేంద్రప్రసాద్ వంటి ప్రముఖతారలు నటిస్తున్న విషయం తెలిసిందే.

# నెక్ట్స్‌ఏంటి? అనేది ఎవరూ చెప్పలేరు



'రొటీన్ సినిమాలతో విసుగొచ్చి, కాస్త విరామం తీసుకుందామని యూఎస్ వెళ్లాను. అక్కడ రాజేశ్‌గారు ఈ కథ చెప్పారు. ఆయన నేరేషన్ అద్భుతం. ఈ సినిమాను ఎవరు తీస్తారు? ఎవరు నిర్మిస్తారు? అనే ఆలోచన కూడా రాలేదు. ఆయనే దర్శక, నిర్మాత అని తెలిసి మరింత ఆనందం అనిపించింది. గట్స్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు రాజేశ్ జగన్నాథం' అన్నారు వరుణ్‌సందేశ్. ఆయన కథానాయకుడిగా యథార్థ సంఘటనల ఆధారంగా రూపొందిన చిత్రం 'నింద'. 'కాండ్రకోట మిస్టరీ' అనేది ఉపశీర్షిక. ఈ నెల 21న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా వరుణ్‌సందేశ్ విలేకరులతో ముచ్చటించారు. 'ఇందులోని నా పాత్రకు, నిజజీవితంలో నాకు అస్సలు పొంతన ఉండదు. నా వ్యక్తిత్వానికీ, మనస్తత్వానికి భిన్నమైన పాత్రను ఇందులో చేశాను. ఎంతో సెటిల్డ్‌గా, మెచ్యూర్డ్‌గా ఇందులో కనిపిస్తాను. సస్పెన్స్, క్రైమ్, థ్రిల్లర్ జానర్‌లలో ఇది ప్రత్యేకం. నెక్ట్స్ ఏంటి? అనేది ఎవరూ చెప్పలేరు. చేసిన మాకే క్యూరియాసిటీ పెరిగింది. అసలు నేరస్తుడెవరు? అనే విషయాన్ని ఎవరూ ఊహించలేరు. అమెరికాలో కూడా సినిమా విడుదల కానుంది' అని తెలిపారు వరుణ్‌సందేశ్.



# వినికిడి శక్తి కోల్పోయిన గాయని అల్కా యాగ్నిక్

బాలీవుడ్‌లో ఎన్నో జనరంజక గీతాలతో సంగీత ప్రియులను అలరించిన ప్రముఖ గాయని అల్కా యాగ్నిక్ నాడీ వ్యవస్థకు సంబంధించిన అరుదైన వ్యాధికి గురైంది. సెన్సారీ న్యూరాల్ నర్వ్ డామేజీ కారణంగా ఆమె వినికిడి శక్తిని కోల్పోయింది. ఈ విషయాన్ని ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా వెల్లడించింది. 'కొద్ది రోజుల క్రితం ఫ్లైట్ దిగి బయటకు వస్తుండగా ఒక్కసారిగా వినికిడి శక్తిని కోల్పోయాను. డాక్టర్లను సంప్రదించగా చెవిలోని నరాలకు సంబంధించి అరుదైన వ్యాధి అని చెప్పారు. వైరస్ ఇన్‌ఫెక్షన్ వల్ల అలా జరుగుతుందని, చికిత్స ద్వారా కోలుకోవచ్చని చెప్పారు.ఈ క్లిష్ట పరిస్థితుల్లో మీ దీవెనలు నాకు ఉండాలని కోరుకుంటూ మీ ప్రేమకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నా' అని ఇన్‌స్టాగ్రామ్‌లో అల్కా యాగ్నిక్ తెలిపింది. 58 ఏళ్ల ఆల్కా యాగ్నిక్ విలక్షణ గాత్రంతో ఎన్నో గొప్ప గీతాలను ఆలపించారు. ముఖ్యంగా ప్రేమగీతాలతో పాపులారిటీ సంపాదించుకున్నారు.



# కామన్ మ్యాన్ ఫ్రస్టేషన్

ప్రియదర్శి, నభా నటేష్ జంటగా నటిస్తున్న చిత్రం 'డార్లింగ్'. అశ్విన్‌రామ్ దర్శకుడు. 'హను-మాన్' ఫేం కె.నిరంజన్‌రెడ్డి నిర్మాత. ప్రస్తుతం సినిమా నిర్మాణంలో ఉంది. మేకర్స్ ప్రమోషన్స్‌ని మొదలుపెట్టారు. ఈ సందర్భంగా ఈ సినిమా నుంచి తొలిపాటను విడుదల చేశారు. 'ఖలసే..' అంటూ సాగే ఈ పాటను కాసర్ల శ్యామ్ రాయగా, వివేక్ సాగర్ స్వరపరిచారు. హనుమాన్ సీహెచ్, రామ్ మిరియాల కలిసి ఆలపించారు. కామన్ మ్యాన్ ఫ్రస్టేషన్‌ని ప్రజెంట్ చేస్తూ ఈ పాట సాగింది. ఈ పాటలో ప్రియదర్శి తన డాన్స్‌తో అలరించారు. బ్రహ్మానందం, విష్ణు, కృష్ణతేజ, అనన్య నాగళ్ల కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: నరేశ్ రామదురై, మాటలు: హేమంత్.

# సందేశాత్మక పోలీస్ కథ



రవికాలె, అజయ్‌ఘోష్, సంజయ్ నాయర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'పోలీస్ వారి హెచ్చరిక'. బాబ్జీ దర్శకత్వం వహిస్తున్నారు. బెల్లి జనార్దన్ నిర్మాత. మంగళవారం ఈ చిత్ర టైటిల్ లోగోను దర్శకుడు తేజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన శక్తివంతమైన టైటిల్‌తో వస్తున్న ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. నేటి వ్యవస్థలోని సమస్యలను చర్చిస్తూ సందేశాత్మకంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: కొండపల్లి నళినీకాంత్, సంగీతం: గజ్వేల్ వేణు, రచన-దర్శకత్వం: బాబ్జీ.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.